



# డ్రగ్స్‌పై యుద్ధం చేద్దాం

## విజయ ఇంజనీరింగ్ కాలేజీలో అవగాహన కార్యక్రమం

వనం నాగయ్య, కెరటం న్యూస్

కళాశాల అంటే నాలుగు గోడల మధ్య తరగతి గదిలో విద్యార్థిని అపురూపమైన శక్తిగా మార్చి వేసే ఒక పరిశ్రమ. అలాంటి పరిశ్రమల్లో యువత సన్మార్గంలో నడవాలంటే వారిపై ప్రత్యేక శ్రద్ధ ఉంటేనే సాధ్యమౌతుంది. ఈ కోవలోనే వేలాది మంది ఉత్తమ విద్యార్థులను, నిపుణులైన యువ ఇంజనీర్లను దేశానికి అందించిన ప్రముఖ విజయ ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థులకు మత్తు వ్యసనాలు ఎంతటి ప్రమాదకరమో వివరించే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి యువతలో మంచి అవగాహన పెంచారు. ముఖ్యంగా మత్తు వ్యసనాలు నేటి యువతను చిత్తు చేస్తున్న నేపథ్యంలో కొకైన్, హెరాయిన్, బ్రౌన్ షుగర్, నల్లమందు, మద్యపానం తదితర మత్తు పదార్థాలను తమ దరిచేరకుండా యువత ఎలా మెసులు కోవాలో విజయ కాలేజీలో చక్కగా వివరించారు. యువత పాలిట కాలకూట విషంలా మారిన డ్రగ్స్ భారిన పడకుండా ఎలా జాగ్రత్తలు తీసుకోవాలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం గురించి వివరించారు. ఇలాంటి సమాజిక కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉండే విజయ ఇంజనీరింగ్ కాలేజీలో తాజాగా మత్తు పదార్థాల నుండి విద్యార్థులను కాపాడుకోవడం ఎలాగో ప్రత్యేక కార్యక్రమం ద్వారా పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..

### విజయ ఇంజినీరింగ్ కాలేజీలో డ్రగ్ అవేర్‌నెస్ కార్యక్రమం

విజయ ఇంజినీరింగ్ కాలేజీలో డ్రగ్ అవేర్‌నెస్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. విద్యార్థుల్లో మత్తు పదార్థాల ప్రమాదాలపై అవగాహన కల్పించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏసీపీ వైరా సారంగపాణి, సీఐ వైరా ప్రసాద్, ఇన్‌స్పెక్టర్ ఈగల్ టీమ్ రాజు, సబ్ ఇన్‌స్పెక్టర్ సురాజ్, కొనిజెర్ల ఎంఆర్వో, ఎంపీఓ, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ అధికారులు, ఐసీడీఎస్ చైల్డ్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధులు, ఏఓ కొనిజెర్ల తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు విద్యార్థులకు డ్రగ్స్ వలన కలిగే అనర్థాలు, ఆరోగ్యపరమైన సమస్యలు, భవిష్యత్తుపై పడే ప్రతికూల ప్రభావాల గురించి వివరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి మంచి లక్ష్యాలను ఏర్పరచుకోవాలని సూచించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డా. వి. చిన్నయ్య మాట్లాడుతూ, విద్యార్థులు తమ జీవితాన్ని నిర్మించుకునే ఈ కీలక దశలో చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ఇలాంటి అవగాహన కార్యక్రమాలు వారికి సరైన దిశను చూపుతాయని అన్నారు. యువతను మత్తుగా, గమ్మత్తుగా మత్తులోకంలోకి తీసుకెళ్లే ఈ డ్రగ్స్(మాదకద్రవ్యాలు) మొదటిగా సరదాగా పార్టీల్లోనూ, ఫంక్షన్‌లలోనూ, స్నేహితుల ఒత్తిడివల్ల, పనిఒత్తిడి తట్టుకోలేని వారు వీటికి అలవాటు అవుతారని అన్నారు. తొలుత నెమ్మదిగా పరిచయం అయిన



డ్రగ్స్ ఆ తరువాత అది వ్యసనంగా, బానిసగా మార్చేస్తుందన్నారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని ఆసక్తిగా వీక్షించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో డ్రగ్‌లపై అవగాహన పెరిగిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. చిన్నయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయేషా తరుణం, డీన్ డాక్టర్ డి. శ్రీనివాసరావు, ఏవో. డాక్టర్ ఫరీద్ బాబా మరియు వివిధ విభాగాల అధిపతులు, కళాశాల అధ్యాపకులు, పాల్గొన్నారు.